కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతి

నూతన్‌కల్‌లో ఘటన

విద్యుత్ శాఖ నిర్లక్ష్యమంటూ గ్రామస్తుల ఆందోళన

వినీత్ గుప్తా (ఫైల్)

మేడ్చల్, సెప్టెంబర్ 24: కరెంట్ షాక్‌తో డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నూతన్‌కల్‌లో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నూతన్‌కల్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి సురేశ్ గుప్తా కుమారుడు వినీత్ గుప్తా (18) మంగళవారం మొదటి అంతస్తు బాల్కనీలో ఉన్న ఇనుపు రాడ్‌ను తీస్తుండగా.. ప్రమాదవశాత్తు భవనానికి అతి సమీపం నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ వైర్‌కు ఇనుప రాడ్ తగిలింది. దీంతో అతడు కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మేడ్చల్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే..

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. వర్షాలతో విద్యుత్ తీగల నుంచి మెరుపులు వస్తున్నాయంటూ పలుమార్లు విద్యుత్ శాఖ సిబ్బందికి, అధికారులు చెప్పినా పట్టించుకోలేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 11కేవీ విద్యుత్ వైర్లు ఇండ్ల మధ్య నుంచి వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. యువకుడి మృతికి విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని బాధ్యులుగా చేస్తూ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ మేనేజర్ అదృశ్యం

పవన్‌కుమార్ (ఫైల్)

ఎల్బీనగర్, సెప్టెంబర్ 24: బ్యాంక్ మేనేజర్ అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. మోహన్‌నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీలోని పద్మజా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న వేదంగి పవన్ కుమార్ (42) గచ్చిబౌలిలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సెప్టెంబర్ 10వ తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయం నుంచి అతడు కనిపించడం లేదు. అప్పటి నుంచి అతడి ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. ఆ రోజు అతడి భార్య, కుమారుడు కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. అప్పటి నుంచే అతడు కనిపించడంలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో సెప్టెంబర్ 21న చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పవన్‌కుమార్ ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వాలని, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాట్లాడుతాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ శాఖలో ఉద్యోగం గొప్ప అవకాశం

ప్రజలతో మమేకమవుతూ పోలీస్ ప్రతిష్టను పెంచాలి

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శిక్షణ ఎస్సైలతో రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): పోలీస్ శాఖలో ఉద్యోగం చేయడం గొప్ప అవకాశమని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు న్యాయం చేయాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీస్ శాఖ పేరు ప్రతిష్టలను మరింత పెంచాలన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో నూతనంగా ఎంపికై.. శిక్షణలో ఉన్న 56 మంది ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులతో మంగళవారం నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి సీపీ దిశా నిర్దేశం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ వ్యవస్థ ప్రాధాన్యత, గొప్పతనాన్ని వివరించారు. పోలీస్ శిక్షణలో గొప్ప విషయాలు చెబుతారని, అన్ని అంశాలపై పట్టు సాధించాలన్నారు. నూతన నేర న్యాయ చట్టాలపై పూర్తిస్థాయి పరిజ్ఞానం, అవగాహన పెంచుకోవాలన్నారు. పౌర సేవలకు అంకితమై.. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సూచించారు. పోలీస్ ఉద్యోగం గొప్ప సంతృప్తిని ఇస్తుందని, ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే వాతావరణం ఎల్లప్పుడు ఉండాలని సూచించారు. సివిల్ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పని చేయాలన్నారు. తోటి సిబ్బందితో స్నేహ పూర్వకంగా మెలుగుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ ఇందిర, ఏసీపీలు నరేందర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీపై సీపీ క్షేత్ర స్థాయి పర్యటన..

నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో వస్తున్న ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీ సుధీర్‌బాబు మంగళవారం రాత్రి ఉప్పల్ నుంచి బోడుప్పల్ వరకు రోడ్డును పరిశీలించారు. రోడ్లపై నీరు చేరడంతో కొన్ని చోట్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్నదని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు.

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుస్తకాన్ని బహూకరిస్తున్న తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, తదితరులు

సోషల్ మీడియా వదిలి.. పుస్తకాలబాట పట్టండి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 24: నేటి యువత సోషల్ మీడియాను వదిలి గ్రంథాలయాల బాట పట్టాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ దీప్తి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలబారిన పడకుండా పుస్తకాలబాట పట్టాలని అన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదవడం వల్ల చరిత్రతో పాటు భవిష్యత్‌ను తెలుసుకోవడానికి అవకాశం ఉన్నదని అన్నారు. తెలంగాణలో ప్రారంభించిన ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా వ్యాపించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాల్లో బుక్ డాక్టర్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మల్లంపేటలో మహిళ హత్య..!

శారద(ఫైల్)

దుండిగల్,సెప్టెంబర్ 24: దుండిగల్ పరిధిలోని మల్లంపేటలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బొడ్డుల శారద (50), ఆమె కుమారుడు సాయివినయ్ మూడేండ్ల కిందట ఉపాధి కోసం నగరానికి వలసొచ్చి, దుండిగల్ పరిధిలోని మల్లంపేటలో ఉన్న శ్రీవంశీ రెసిడెన్సీలో ఉంటున్నారు. సాయివినయ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, శారద స్థానికంగా ఉన్న ఇందిరమ్మ కాలనీ వద్ద విఘ్నేశ్వర స్టాల్ పేరిట మిల్క్‌స్టోర్ నడుపుతున్నది. సోమవారం ఉదయం 8.40 గంటల సమయంలో సాయివినయ్ ఉద్యోగానికి వెళ్తూ.. తల్లి శారదను మిల్క్‌సెంటర్ వద్ద వదిలి వెళ్లాడు. అనంతరం రాత్రి 8.30 గంటల సమయంలో సాయి వినయ్ తన తల్లికి ఫోన్‌చేయగా.. ఎంతకీ కాల్ లిఫ్ట్‌చేయలేదు. దీంతో అతడు తమ పక్క పోర్షన్‌లో ఉంటున్న నరేశ్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. అతడు శారద ఉంటున్న ఫ్లాట్‌లోకి వెళ్లి చూడగా.. ఆమె తన మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉంది. అదే సమాచారాన్ని సాయి వినయ్‌కు తెలిపాడు. దీంతో సాయి వినయ్ వెంటనే ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే శారద మరణించినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ వైద్యశాలకు తరలించారు.

నగల కోసమే హత్య చేశారా..?

శారద చెవులకు ఉండాల్సిన బంగారు కమ్మలు, ముక్కుపుడక కనిపించకపోవడంతో పోలీసులు ఇది దోపిడీ దొంగల పనిగా భావిస్తున్నారు. అయితే, 11 గంటల సమయంలో శారదతో కలిసి ఓ వ్యక్తి ఫ్లాట్‌కు వచ్చి, ఓ గంట సేపటి తర్వాత తిరిగి బయటకు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యిందని పోలీసులు తెలిపారు. అతడిని గుర్తించకుండా ముఖానికి మాస్క్ కూడా ధరించాడని పోలీసులు పేర్కొన్నారు. ఇది అతడు చేసిన పనై ఉంటుందా..? లేక నగల కోసం దొంగలు శారదను చంపి ఉంటారా..? అనేది తేలాల్సి ఉన్నదన్నారు. శారదతో ఫ్లాట్‌కు వచ్చిన వ్యక్తి తిరిగి బయటకు వెళ్లే సమయంలో మాత్రం హడావుడిగా వెళ్లడంతో అతడిపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఘటనా స్థలాన్ని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీష్ సందర్శించి, హత్య జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు.

పది జిల్లాల ఫుట్‌బాల్ అసోసియేషన్లకు చెందిన ప్రతినిధులతో పాటు రాష్ట్ర కార్యదర్శి అఫ్సర్ అహ్మద్ మంగళ వారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, సాట్స్ ఎండీ సోనీ బాలదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి సహకరించాలని కోరారు.

మియాపూర్‌లో హిట్ అండ్ రన్ గుర్తు తెలియని యువకుడి మృతి

మియాపూర్: మియాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్న హిట్ అండ్ రన్ ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మియాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో మియాపూర్ నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్లే దారిలో ఉన్న మెట్రో పిల్లర్ 622 బస్టాప్ సమీపంలో గుర్తు తెలియని (30) ఓ యువకుడిని వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సదరు యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని, వివరాలు తెలిస్తే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ దుర్గా రామలింగప్రసాద్ తెలిపారు.

కందుకూరులో యువకుడు..

కందుకూరు, సెప్టెంబర్ 24: ప్రమాదవశాత్తు ఓ యువకుడు కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. కందుకూరు పోలీసుల కథనం ప్రకారం.. లేమూరు గ్రామానికి చెందిన కందికంటి బాబయ్య కుమారుడు సాయికుమార్ జీవనోపాధి కోసం గ్రామంలో ఓ షెట్టర్‌ను అద్దెకు తీసుకొని.. అందులో ఇస్త్రీరాకులతో పాటు ప్లేట్లను తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నాడు. దిన చర్యల్లో భాగంగా మంగళవారం ఉదయం పరిశ్రమకు వచ్చి పనిలో నిమగ్నమయ్యాడు. పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మిషన్‌పై పడి మృతి చెందాడు. మిషన్‌పై పడటాన్ని గమనించిన అతడి బావ కిషన్ వచ్చిచూడగా.. చనిపోయాడు. వెంటనే కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఓఆర్ఆర్‌పై ప్రమాదం.. ఇద్దరి మృతి

ఘట్‌కేసర్, సెప్టెంబర్ 24: ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ రింగ్‌రోడ్డుపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘట్‌కేసర్ పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సురేశ్, రాఘవ రావు, ఎం.రమేశ్, అన్నమయ్య కలిసి నిజామాబాద్‌లో సొంత పనులు చూసుకొని.. తిరిగి అవుటర్ రింగ్‌రోడ్డు పైనుంచి కారులో ప్రయాణిస్తున్నారు. ఘట్‌కేసర్ సమీపంలో వీరి వాహనం అదుపుతప్పి ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సురేశ్, రాఘవ రావు మరణించగా, అన్నమయ్య, రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఘట్‌కేసర్ పోలీసులు.. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసిన ఘట్‌కేసర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మాజీ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడిపై దాడి

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 24: మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిలకమర్రి నర్సింహపై అదే గ్రామానికి చెందిన కత్తుల జనార్దన్‌తో పాటు మరికొంత మంది కలిసి మంగళవారం దాడి చేశారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ముచ్చింతల్ గ్రామానికి చెందిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చికలమర్రి నర్సింహ మంగళవారం ఉదయం తన కారులో జీమ్స్ దవాఖాన సమీపం నుంచి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన కత్తుల జనార్దన్‌తో పాటు మరికొంత మంది వచ్చి దాడి చేసి, కారును ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

28న జాతీయ లోక్ అదాలత్

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 24: తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 28 న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివాదాల పరిష్కారానికి అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. పాత కేసులను సత్వరమే.. సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఈ లోక్ అదాలత్ ఒక వేదికగా నిలువనున్నది. కాంపౌండబుల్ క్రిమినల్ కేసులతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలీసు, లీగల్ సర్వీస్ అథారిటీ అధికారులు ఒక ప్రకటనలో కోరారు. ఈ లోక్ అదాలత్ ద్వారా సమయం ఆదా కావడంతో పాటు వ్యయ ప్రయాసలు తప్పుతాయని, కక్షలు వీడి కేసుల పరిష్కారానికి కక్షిదారులు ముందుకురావాలని కోరారు.

పుట్టిన రోజు వేడుకలకు పిలిచి.. వృద్ధురాలిపై దాడి

మద్యం తాగించి బంగారు, వెండి ఆభరణాలు దోపిడీ

పరారీలో నిందితులు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

శామీర్‌పేట, సెప్టెంబర్ 24: పుట్టిన రోజు వేడుకలకు ఆహ్వానించారు. పార్టీ పేరుతో మద్యం తాగించి.. తలను గోడకేసి బాదారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి.. ఆ వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారం, వెండి ఆభరణాలు తీసుకొని ఉడాయించారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధిత మహిళ కుటుంబీకుల కథనం ప్రకారం.. జగ్గంగూడ గ్రామానికి చెందిన చెవ్వ రాములమ్మ కూలీ. తన వద్ద ఉన్న డబ్బులను చేతి బదులు కింద అప్పులుగా ఇస్తూ జీవనం సాగిస్తున్నది. వారం రోజుల కిందట ఓ కుటుంబసభ్యులు అద్దెకు ఇల్లు కావాలని రాములమ్మను అడిగారు. దీంతో ఆమె తన ఇంటికి ఎదురుగా ఉన్న ఇల్లును అద్దెకు ఇప్పించింది. ఇదిలా ఉండగా.. అప్పటి నుంచి రాములమ్మ నగలపై వారు కన్నేశారు. పథకం ప్రకారం పుట్టిన రోజు వేడుకల పేరుతో ఆమెను పిలిచారు. విందు పేరుతో మద్యం తాగించారు. మత్తులో ఉన్న ఆమెపై దాడిచేసి, తలను గోడకేసి బాదారు. అరుపులు బయటకు వినిపించకుండా ఆమె నోట్లో గుడ్డలు కుక్కారు. ఆమె ఒంటిపై ఉన్న ఏడు తులాల బంగారు, 30 తులాల వెండి నగలను దోచుకొని పరారయ్యారు. స్పృహలోకి వచ్చిన రాములమ్మ కేకలు విన్న పక్కింటి వాళ్లు.. ఆమెను గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీస్ ఉన్నతాధికారులు బాధితురాలిని పరామర్శించి.. దాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు.

మొన్న చైన్ స్నాచింగ్.. నేడు దోపిడీ..

రాములమ్మకు నగలు నష్టాన్ని తెచ్చి పెడుతున్నాయి. కొన్ని నెలల కిందట ఆమె కోడలు పద్మ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. బైక్‌పై వచ్చిన దుండగులు ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును తెంచుకొని పారిపోయారు. ఆ ఘటన మరువక ముందే సోమవారం రాత్రి పుట్టిన రోజు వేడుకల పేరుతో రాములమ్మపై దాడి జరగడం, నిందితులు ఆమె మెడలో ఉన్న ఏడు తులాల బంగారం, దాదాపు 30 తులాల వెండి ఆభరణాలతో పాటు కొంత నగదును దోచుకుపోయారు.

ల్యాబ్ టు ల్యాండ్ సంస్థ మోసాలు

రోడ్డెక్కిన డీలర్లు..

రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు

ల్యాబ్ టు ల్యాండ్ అగ్రి సంస్థపై పీఎస్‌లో ఫిర్యాదు చేసి బయటకు వస్తున్న బాధిత డీలర్లు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 24: ల్యాబ్ టు ల్యాండ్ అగ్రి సొల్యూషన్స్ సంస్థ తమను మోసం చేసిందని, మా డాక్యుమెంట్లతో లోన్లు పెట్టి లక్షల్లో డబ్బులు దండుకున్నారంటూ బాధిత డీలర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సదరు సంస్థ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తాజాగా, డీలర్లు న్యాయం చేయాలని కోరుతూ రోడ్డెక్కారు. మాదాపూర్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో బాధితులు ధర్నాకు దిగారు. ఈ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, ఇన్‌స్పెక్టర్ సీహెచ్. వెంకన్న తెలిపిన కథనం ప్రకారం.. మాదాపూర్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో కార్యకలాపాలు సాగించే ల్యాబ్ టు ల్యాండ్ అగ్రి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవసాయ ఎరువులు సరఫరా చేస్తామని, డీలర్ షిప్‌లు ఇస్తామంటూ నమ్మించి మోసం చేసిందని పలువురు డీలర్లు మంగళవారం ఆందోళనకు దిగారు. డీలర్లకు సంబంధించి షాపుల పేరిట ఉన్న చెక్కులు, డాక్యుమెంట్లు తీసుకొని మొబైల్ యాప్‌ను చూపించి తమ పేర్లతో రూ. లక్షల్లో ఇతర ఫైనాన్స్ సంస్థల నుంచి లోన్లు కూడా తీసుకున్నారని, ఎరువులు సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్ల పేరిట అప్పులు ఇచ్చిన సదరు ఫైనాన్స్ సంస్థల నుంచి నోటీసులు మాత్రం తమకు వస్తున్నాయని, డబ్బులు మాత్రం ల్యాబ్ టు ల్యాండ్ సంస్థ ఖాజేసిందని పేర్కొన్నారు. సదరు సంస్థపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన కొనసాగించారు. సంస్థ కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా.. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు సర్దిచెప్పారు. రాయదుర్గం పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో డీలర్లు సమీపంలోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి.. ల్యాబ్ టు ల్యాండ్ సంస్థపై ఫిర్యాదు చేశారు. గతంలో ఉద్యోగులు సైతం సదరు సంస్థ మోసాలపై ఫిర్యాదు చేశారు. సంస్థ సీఈఓ ఆదిత్యపై గత ఏప్రిల్‌లో చీటింగ్ కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ సీహెచ్. వెంకన్న తెలిపారు. లక్షల్లో లోన్లు తీసుకొని తమకు ఎరువుల సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ దాదాపు 25 మంది ఫిర్యాదు చేశారని తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేండ్ల జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఒంటరిగా వెళ్తున్న బాలిక చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించిన ఆటోడ్రైవర్ అయిన నిందితుడు భీమనపల్లి రాజు (23)కు ఐదేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 12,500 జరిమానా విధిస్తూ, బాధిత బాలికకు పరిహారంగా రూ. రెండు లక్షలు చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయమూర్తి పద్మావతి తీర్పునిచ్చారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన బాలిక తన తండ్రికి రావాల్సిన డబ్బులను తీసుకురావడానికి 2018, మే 3వ తేదీన ప్లాస్టిక్ గోదాం వద్దకు వెళ్లింది. ఆ గోదాం సమీపంలో ఉన్న నిందితుడు బాలికను అడ్డగించి బలవంతంగా పక్కనే ఉన్న ప్రదేశానికి లాక్కు వెళ్తుండగా.. బాలిక కేకలు వేసింది. దీంతో పలువురు అక్కడికి రావడంతో నిందితుడు పారిపోయాడు. బాలిక ఈ విషయాన్ని తన తల్లికి చెప్పింది. దీంతో ఆమె అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు రాజుకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

బాలిక నగ్న వీడియోలు.. సర్క్యులేట్ చేస్తున్న వ్యక్తి అరెస్టు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): స్నాప్‌చాట్‌తో వీడియో కాల్ చేసి.. బాలిక వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్న ఓ ఎలక్ట్రిషియన్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సైబర్‌క్రైమ్స్ డీసీపీ దార కవిత తెలిపారు. తలాబ్‌కట్ట నివాసి అఖిల్ ఉద్దీన్ ఎలక్ట్రిషియన్. బండ్లగూడ ప్రాంతంలో ఉండే ఒక బాలికకు స్నాప్‌చాట్ అప్లికేషన్‌తో వీడియో కాల్ చేసి, ఆ బాలికకు సంబంధించిన వ్యక్తిగత వీడియోలు తీశాడు. ఆ వీడియోలను స్నాప్‌చాట్‌లో సర్క్యులేట్ చేస్తున్నాడు. బాధితురాలి తల్లి ఈ నెల 7న సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఏసీపీ చాంద్‌పాషా నేతృత్వంలోని ఇన్‌స్పెక్టర్ మధులత బృందం దర్యాప్తు చేపట్టి.. నిందితుడిని అరెస్ట్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం

★మీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలకైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085
NT-331742

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి, మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9398709618.
NT-333108

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: